





కల్యాణ వైభోగమే..

- మాఘమాసం రాకతో ఊరూరా పెళ్లి సందడి
- నెల పొడవునా శుభ ముహూర్తాలు
- జిల్లాలో పెద్ద సంఖ్యలో వివాహాలు
- ఒక్కటి కానున్న వందలాది జంటలు



కొత్తచెరువు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): శుభ ముహూర్తాల మాఘమాసం వచ్చేసింది. శుభకార్యాలకు వేళయింది. పుష్యమాసం ముగిసి మాఘం ప్రారంభం కావడంతో శుక్రవారం నుంచే పెళ్లి బాజాలు మోగనున్నాయి. నెల మొత్తం శుభముహూర్తాలున్నాయి. దీంతో పెద్ద సంఖ్యలో వివాహాలు జరగనున్నాయి. ఇతర శుభకార్యాలు కూడా అదే స్థాయిలో ఉంటాయి. దీంతో ఊరూరా సందడి నెలకొంది. కల్యాణానికి ముహూర్తాలు నిర్ణయించుకుని ఫంక్షన్‌హాల్, డెకరేషన్, క్యాటరింగ్ తదితర ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఈ ఏడాది అధిక సంఖ్యలో వివాహాలు జ రగనున్నట్లు పండితులు చెబుతున్నారు. మార్చి 16వతేదీ వరకు పెళ్లిళ్లు, గృహప్రవేశాలకు మంచి ముహూర్తాలు ఉన్నాయని పండితులు చెబుతున్నారు.

ఫంక్షన్ హాళ్లకు పెరిగిన డిమాండ్

ఒకప్పుడు పెళ్లిళ్లు, శుభ కార్యక్రమాలు ఇళ్ల వద్దే నిర్వహించేవారు. మారుతున్న కాలానుగుణంగా ప్రస్తుతం పెళ్లిళ్లు చాలా వరకు ఫంక్షన్ హాళ్లలోనే చేస్తున్నారు. అందుకోసం భారీగానే ఖర్చు చేస్తున్నారు కూడా. దీంతో ఫంక్షన్ హాళ్లకు డిమాండ్ పెరిగింది. శుభ ముహూర్తాల వేళ నెల రోజుల ముందే ఫంక్షన్ హాల్‌ను బుక్ చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. క్యాటరింగ్, డెకరేషన్ సామగ్రి ఇలా.. అన్నింటికీ విపరీతమైన డిమాండ్ నెలకొంది.

మంచి ముహూర్తాలు ఇవీ..

మాఘ మాసంలో బలమైన ముహూర్తాలున్నాయి. ఫిబ్రవరి 7, 8, 13 15, 16, 19, 20, 21, 22, 23 తేదీల్లో ముహూర్తాలు ఉన్నాయని వేదపండితులు తెలిపారు.

షాపింగ్‌లతో కిటకిట

శుభ కార్యాలు అనగానే ముందుగా గుర్తొచ్చేది షాపింగ్. దుస్తులు, బంగారం కొనుగోళ్లతో దుకాణాలు ప్రస్తుతం కిటకిటలాడుతున్నాయి. పెళ్లి సమయంలో వాహనాలకు కూడా భారీ డిమాండ్ ఉంటుంది. పెళ్లివారు ట్రావెల్ ఏజెన్సీలను సంప్రదిస్తూ నెల ముందే వాహనాలను సైతం బుక్ చేసుకున్నారు.

పురోహితులు బిజీ.. బిజీ..

హిందూ సంప్రదాయంలో పురోహితుడు లేనిదే పెళ్లి జరగదు. ప్రస్తుతం వీరికి డి మాండ్ పెరిగింది. ఐదు రోజులు బలమైన ముహూర్తాలు ఉండటంతో ఒక్కో పురోహితుడు రోజుకు రెండు, మూడు పెళ్లిళ్లు చేయించేందుకు సిద్ధమయ్యారు. ఇతర శు భ కార్యక్రమాలు కూడా అధికంగా ఉండటంతో పురోహితులు సైతం బీజీబీజీగా ఉ న్నారు. ఒక్కో పురోహితుడు వివాహానికి వారివారి పరపతిని బట్టి రూ.5వేల నుంచి రూ.50వేల వరకు తీసుకుంటున్నారు. వారికి కూడా డిమాండ్ ఏర్పడింది.

మాఘమాసం.. ఎంతో విశిష్టమైనది..



మాఘమాసం అంటేనే వివాహాలు, శుభకార్యాలకు ఎంతో విశిష్టమైనది. ఈ మాసంలో పెళ్లిళ్లు అధికంగా జరుగుతాయి. గృహప్రవేశాలు, సీమంతాలు, నామకరణం, అక్షరాభ్యాసం, పుట్టింటి నుంచి వడిబియ్యం కూడా ఇస్తుంటారు. ఈ మాసంలో పెళ్లిళ్లు చేసుకోవడానికి ఎక్కువ శాతం మంది వేచి ఉంటారు.

-గురుప్రసాద్, పురోహితుడు

ఇకరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా 22,433 మంది కనబడుటలేదు. నమ్మశక్యంగా లేకున్నా.. ఇది ముమ్మాటికీ వాస్తవమే. అది కూడా.. అన్నదాతల కోసం ఏర్పాటు చేసిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘా(పీఏసీఎస్)ల్లో కావడం శోచనీయం. ఇంత మంది బోగస్ రైతులు నమోదు చేసుకున్నట్లు అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. గత వైసీపీ హయాంలో సొసైటీల్లో తమ ఆధిపత్యాన్ని చెలాయించేందుకు ఆ పార్టీ నాయకులు.. బోగస్‌లకు విచ్చలవిడిగా సభ్యత్వాలు కల్పించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ బోగస్‌లు రైతులకు అందాల్సిన ప్రభుత్వ ప్రయోజనాలకు కాజేశారు. సభ్యుల వివరాలను కంప్యూటీకరిస్తుండడంతో బోగస్‌లు వేల సంఖ్యలో బయట పడుతున్నారు.

-కదిరి అర్బన్, ఆంధ్రజ్యోతి



కదిరిలోని ఏడీసీసీ బ్యాంకు శాఖ

22,433 మంది మిస్సింగ్..!

సహకార సంఘాల్లో బోగస్‌లు

- కంప్యూటీకరణతో వెలుగుచూస్తున్న అక్రమాలు
- వైసీపీ హయాంలో అడ్డగోలుగా సభ్యత్వాలు

ప్రక్షాళన మొదలు..

పీఏసీఎస్‌లలో సభ్యత్వాల ప్రక్షాళన మొదలైంది. సొసైటీలను బలోపేతం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమాయత్తమయ్యాయి. రైతులు సభ్యులుగా ఉండే పీఏసీఎస్‌లలో కొంతమంది బినామీ పేర్లతో ప్రభుత్వ పథకాలు పొందుతున్నారు. గత వైసీపీ పాలనలో పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడినట్లు విమర్శలున్నాయి. పలువురికి భూములు లేకపోయినా, సభ్యులుగా చేర్పించారు. ఓటు హక్కుకోసం రాజకీయ పార్టీలకు చెందిన గ్రామస్థాయి నాయకులు అర్హత లేనివారికి సభ్యత్వం కల్పించారు. రుణాలు సైతం మంజూరు చేయించుకున్నారన్న విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో సభ్యుల వివరాలను ఆన్‌లైన్ చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. సభ్యత్వమున్న అందరి ఖాతాలకు ఈకేవైసీ చేయాలని ఆదేశించింది.

జిల్లాలో పరిస్థితి ఇదీ..

సహకార సంఘాల ఆర్థిక లావాదేవీలన్నీ ఆన్‌లైన్ చేసే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతోంది. ఈ ప్రక్రియ పూర్తయ్యేలా సహకార అధికారులు పర్యవేక్షిస్తున్నారు. సంఘాల్లో సభ్యత్వమున్న రైతుల ఈకేవైసీ ప్రక్రియను గ్రామ సచివాలయాలకు అప్పగించారు. జిల్లాలో 54 సహకార సంఘాలున్నాయి. వీటిలో 1,20,138 మంది సభ్యులున్నారు. వారికి ఈ కేవైసీ చేస్తున్నారు. ఇప్పటి వరకు 22,433 మంది ఆచూకీ దొరకడంలేదు. సహకార సంఘాల్లో సభ్యత్వం కలిగి ఉన్నారే తప్ప..

సభ్యత్వం ఉన్నా.. ఆచూకీ లేదు..

వారెక్కడున్నారో తెలియడంలేదు. గత వైసీపీ పాలనలో కేవలం సహకార రుణాల కోసం ఇతర ప్రాంతాల ప్రజలు సభ్యత్వం చేయించుకున్నారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సహకరించకుండా తిప్పలు..

సచివాలయ సిబ్బంది తమ పరిధిలోని సంఘాల సభ్యులకు నేరుగా ఫోన్ చేసి వివరాలు తెలుసుకుంటున్నారు. కొంతమంది ఓటీపీలు, సక్రమంగా చెప్పడంలేదని తెలుస్తోంది. భూములు కొనుగోలు చేసినవారు మ్యుటేషన్‌లో పేరు మార్చకపోవడంతో కొనుగోలు చేసినవారు ఓటీపీలు చెప్పడంలేదు. భూములున్న ఉద్యోగులు కూడా కొంతమంది ఈకేవైసీ చేయించేందుకు ముందుకు రావడం లేదు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి సహకార సంఘాల్లో ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఆ మేరకు ఈకేవైసీ పూర్తి చేసే పనిలో సచివాలయ ఉద్యోగులున్నారు.



వేగవంతంగా ఈకేవైసీ



ఈకేవైసీ ప్రక్రియను వేగవంతంగా చేపడుతున్నాం. గతంలో నమోదైన చాలామంది సభ్యులు ఉపాధి, ఉద్యోగ, వ్యాపారాల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లడంతో అందుబాటులో లేరు. మరికొంతమంది మృతిచెందడంతో ఈకేవైసీ జాప్యం అవుతోంది. క్షేత్రస్థాయిలో వెనుకబడిన సహకార సంఘాలపై దృష్టి సారిస్తున్నాం. వీలైనంత త్వరగా ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తీసుకొస్తాం.

- కృష్ణానాయక్,
జిల్లా సహకార అధికారి

అక్రమాలకు చెక్

సహకార సంఘాల్లో కొంతమంది బినామీపేర్లతో ప్రభుత్వ పథకాలను పొందుతున్నారు. అర్హులకు అన్యాయం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అనర్హులను గుర్తించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. సభ్యుల్లో అనేకమంది ఏళ్ల క్రితమే సభ్యత్వం పొందారు. తరువాత వారిలో కొంతమంది భూములను అమ్ముకున్నారు. మరికొంతమంది వృద్ధాప్యం, ఇతర కారణాలతో మృతిచెందారు. ఇంకొంత మంది భూములను తమ పిల్లల పేరుతో మార్చుకున్నారు. బ్యాంకులో రుణాలు, పేరుపై భూమిలేకపోయినా, వీరంతా ఇప్పటికీ సభ్యులుగా కొనసాగుతున్నారు. అంతేకాదు, మండలసరిహద్దు గ్రామాల్లోని కొంతమంది రైతులకు రెండు, మూడు రెవెన్యూ గ్రామాల పరిధిలో భూములున్నాయి. వీరు ఆయా కేంద్రాల్లో రుణాలు తీసుకోవడంతోపాటు సొసైటీలోసభ్యత్వం కలిగి ఉంటున్నారు. ఒకే వ్యక్తి రెండు, మూడు సొసైటీల్లో ఓటు హక్కు వినియోగించుకోవడంతోపాటు, రుణాలు పొందుతున్నాడు. పలు అక్రమాలకు పాల్పడుతునట్లు ఆరోపణలు లేకపోలేదు. వీటన్నింటికీ ఈకేవైసీ ద్వారా చెక్ పడనుంది.

ఆన్‌లైన్ పూర్తయితే..

సొసైటీల్లో ఆన్‌లైన్ పూర్తయితే గతంలో లాగా రైతు రుణాలు, వడ్డీ వివరాలు తెలుసుకునేందుకు సొసైటీ కార్యదర్శులపై ఆధారపడాల్సిన అవసరం ఉండదు. లావాదేవీలను సులువుగా తెలుసుకోవచ్చు. బ్యాంకులో లాగానే ఏ లావాదేవీ జరిగినా, సెల్‌ఫోన్‌కు మెసేజ్ వస్తుంది. రుణం ఎంత ఉంది, వడ్డీ ఎంత చెల్లించాలి, డిపాజిట్‌పై ఇప్పటి వరకుఎంత వడ్డీ జమయింది, నగదు ఎంత నిలువ ఉంది, తదితర వివరాలను చిటికెలో తెలుసుకోవచ్చు. ఏపీసీఎస్‌లలో కంప్యూటీకరణ ద్వారా సహకార సంఘాల నిధుల దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయవచ్చు. రైతులకు పారదర్శక సేవలందించడానికి అవకాశం ఏర్పడుతుంది.

వైభవం.. వీరకేతమ్మ దేవి

బ్రహ్మ రథోత్సవం



బ్రహ్మ రథంపై ఊరేగుతున్న అమ్మవారు, మూల విగ్రహానికి అలంకరణ (ఇన్‌సెట్లో..)

మడకశిర రూరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రసిద్ధిచెందిన కల్లుమర్రి వీరకేతమ్మదేవి బ్రహ్మ రథోత్సవం ఆదివారం వైభవంగా సాగింది. వేకువజాము నుంచి అమ్మవారి ఆలయంలో అభిషేకాలు, తోమాలపూజ, నాగదేవత హోమం, చండీయాగం నిర్వహించారు. మూల విగ్రహాన్ని అలంకరించారు. మధ్యాహ్నం ఒంటి గంటకు వేలాదిగా తరలివచ్చిన భక్తుల నడుమ అమ్మవారి బ్రహ్మ రథోత్సవం వైభవంగా సాగింది. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహిళలకు పసుపు, కుంకుమ, గాజులు, పూలు అందజేశారు.

చింతపండు క్రయవిక్రయాలు ప్రారంభం



చింతపండు వేలంపాట పాడుతున్న అధికారులు

హిందూపురం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో సోమవారం చింతపండు క్రయవిక్రయాలు ప్రారంభమయ్యాయి. ఏటా సంక్రాంతికే ప్రారంభించేవారు. ఈ ఏడాది చింతకాయల పంట ఆలస్యంగా రావడంతో ఆలస్యంగా మొదలెట్టారు. సోమవారం కర్ప్యాలీ, ఫ్లవర్ రకం చిం తపండు మార్కెట్‌కు 12 లారీలు వచ్చింది. కర్ప్యాలీ మొదటి రకం పది కిలోలు రూ.3వేలు పలికింది. రెండో రకం రూ.1500 నుంచి రూ.2500దాకా అమ్ముడుపోయింది. ఫ్లవర్ రకం మొదటిరకం రూ.1400.. రెండో రకం రూ.500 నుంచి రూ.వెయ్యిదాకా ధర పలికింది. మొదటిరోజు కావడంతో మార్కెట్ అధికారులు వ్యాపారులు, రైతులు కలిసి పూజలు చేసి, క్రయవిక్రయాలు ప్రాంభించారు.



మార్కెట్‌కు వచ్చిన చింతపండు

- హీటెక్కిన మున్సిపల్ రాజకీయం
- నేడే చైర్మన్ ఎన్నిక
- పురానికి చేరుకున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

విప్‌పై వైసీపీ.. రాద్ధాంతం..!

సస్పెండ్ చేసిన వారికి ఇవ్వడంపై టీడీపీ సభ్యుల ఆగ్రహం

హిందూపురం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): వైసీపీ నుంచి ఆరు నెలల క్రితమే కౌన్సిలర్లను సస్పెండ్ చేశారు. తమ పార్టీతో సంబంధం లేదని సాక్షాత్తు జిల్లా అధ్యక్షుడే అప్పట్లో ప్రకటించారు. మున్సిపల్ చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో సస్పెండ్ చేసిన వారికి విప్ జారీచేయడంపై రాజకీయ వర్గాల్లో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చైర్మన్ ఎన్నిక జరిగే సమయానికి 24గంటల ముందు సంబంధిత అధికారికి ఫలానా సభ్యులు తమ పార్టీ వారనీ, విప్ జారీ చేస్తున్నట్లు పార్టీ అధిష్ఠానం నుంచి లేఖ ఇవ్వాల్సి ఉంటుంది. అది కూడా మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఎన్నికల అధికారికి ఇవ్వడానికి వెళ్లి సమయం ముగిసిందని చెప్పడంతో వైసీపీ నాయకులు, కౌన్సిలర్లు రాద్ధాంతం చేశారు. అయినా ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకే తాము నడుచుకుంటామని అధికారులు చెప్పడంతో సభ్యులు, వైసీపీ నాయకులు వెనుదిరిగారు. దీనిపై ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ రాద్ధాంతం చేయడానికి ప్రయత్నించారు. అయినా అధికారులు నిబంధనల మేరకే నడుచుకుంటామని కరాఖండిగా చెప్పడంతో చేసేదిలేక అధికార పార్టీపై విమర్శలు గుప్పించారు.



హిందూపురానికి చేరుకున్న బాలకృష్ణ

టీడీపీ సభ్యుల ఆగ్రహం

వైసీపీ నుంచి ఆరు నెలల క్రితం తెలుగుదేశం పార్టీలోకి పలువురు సభ్యులు చేరారు. వైసీపీలో ఉంటే అభివృద్ధి చేయలేమని భావించి సైకిల్ ఎక్కారు. వీరిని వైసీపీ అప్పట్లో సస్పెండ్ చేసింది. దీంతో ఆ పార్టీకి, కౌన్సిలర్లకు ఎలాంటి సంబంధం ఉండదు. ఆ పార్టీ నుంచి సస్పెండ్ చేసిన వారికి విప్ జారీచేసే అధికారం ఎవరిచ్చారంటూ తెలుగుదేశం పార్టీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇలాంటి సమయాల్లో ఏ పార్టీ రాద్ధాంతం చేసిన దాఖలాల్లేవనీ, వైసీపీ కుతంత్ర రాజకీయాలకు తెరలేపుతోందని ఆరోపించారు. మెజార్టీ సభ్యులు పార్టీ మారామనీ, వైసీపీ జిల్లా అధ్యక్షురాలు నోటికి వచ్చినట్లు మాట్లాడడం అవివేకమంటూ క్యాంపులో ఉన్న టీడీపీ సభ్యులు విమర్శించారు.

హీటెక్కిన రాజకీయం

సోమవారం మున్సిపల్ చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో రాజకీయం హీటెక్కింది. ఇప్పటి వరకు తెలుగుదేశం పార్టీ నాయకులు, కౌన్సిలర్లు ఎక్కడా నోరు మెదపకుండా ఉన్నారు. అయినా వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీతోపాటు ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక మాత్రం మున్సిపల్ చైర్మన్ ఎన్నికపై గగ్గోలు పెడుతున్నారు. వాస్తవంగా వైసీపీకి బలం ఉంటే వారు ఇంత రాద్ధాంతం చేయాల్సిన అవసరం ఏముందని ఆ పార్టీ నాయకులే ప్రశ్నిస్తున్నారు. పదవిని అడ్డదారిలో దక్కించుకోవాలని ఆరాటపడుతున్న వైసీపీకి ఇంకా బుద్ధి రాలేదని ఆ పార్టీ ముఖ్య నాయకులే విమర్శలు గుప్పిస్తున్నారు. ఆదివారం విప్ రాజకీయం చేయడాన్ని రాజకీయ విశ్లేషకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఎన్నికలు సజావుగా జరగాలని భావించి ఉండుంటే రెండు రోజులు ముందుగానే విప్ జారీ చేయవచ్చు అనీ, అలాకాకుండా రాజకీయంగా ఆరోపణలు చేయడం కోసమే సమయం ముగిసిన తరువాత విప్ ఇవ్వడానికి ప్రయత్నం చేశారన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

పురానికి చేరుకున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

మున్సిపల్ చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆదివారం సాయంత్రానికే హిందూపురం చేరుకున్నారు. ఎమ్మెల్యేకు బా గేపల్లి టోల్‌గేట్, లేపాక్షివద్ద ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు స్వాగతం పలికారు. సోమవారం మున్సిపల్ చైర్మన్ ఎన్నికలో ఎమ్మెల్యే పాల్గొననున్నారు. హిందూపురంలో 38 వార్డులున్నాయి. చైర్మన్ ఎన్నికకు 20 మం ది సభ్యులు అవసరం. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీకి 21 మంది కౌన్సిలర్లతోపాటు ఎమ్మెల్యే, ఎంపీ ఓటు కూడా ఉన్నాయి. ఈలెక్కన టీడీపీ బలం 23కి చేరింది. వైసీపీకి మాత్రం 17మంది కౌన్సిలర్లు ఉంటారు. ఇందులో కూడా కొంతమంది గైర్హాజరయ్యే అవకాశం ఉన్నట్లు రాజకీయ వర్గాల ద్వారా తెలుస్తోంది.

భారీ భద్రత

సోమవారం ఉదయం 11గంటలకు చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఎస్పీ ఆధ్వర్యంలో ముగ్గురు డీఎస్పీలు, పది మంది సీఐలు, 15మంది ఎస్‌ఐలతో భద్రత కల్పించినట్లు పోలీసులు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ ఎన్నిక సందర్భంగా మీడియాను సైతం కార్యాలయంలోకి అనుమతించేది లేదంటూ ఎన్నికల అధికారి ఆర్డీఓ ఆనంద్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయానికి వంద మీటర్ల వరకు పరిసరాల్లో 144 సెక్షన్ అమలు చేయనున్నారు. ఎమ్మెల్యే, ఎంపీ, కౌన్సిలర్లు, ఎన్నికలకు సంబంధించిన అధికారులకు మాత్రం మున్సిపల్ కార్యాలయంలోకి అనుమతి ఉంటుందన్నారు. భద్రతా ఏర్పాట్లను ఎస్పీ రత్న పరిశీలించారు. ఎస్పీ వెంట డీఎస్పీ మహేష్, సీఐలు రాజగోపాల్‌నాయుడు, అంజనేయులు ఉన్నారు.



మున్సిపల్ కార్యాలయంలో బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ రత్న

క్రైం కార్నర్

గంటల వ్యవధిలోనే నిందితుడి అరెస్ట్

● ఏడేళ్ల బాలుడిని కాపాడిన ధర్మవరం పోలీసులు

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): భార్య, అత్తపై దాడికి పాల్పడి ఏడేళ్ల కుమారుడిని ఎత్తుకెళ్లిన నిందితుడిని ధర్మవరం పోలీసులు గంటల వ్యవధిలోనే అరెస్ట్ చేశారు. ధర్మవరం మండలం బడన్నపల్లికి చెందిన తన భార్య కాపురానికి రాలేదని ఆమెపైనా, అత్తపైనా కడప జిల్లా వేముల మండలం భూమయ్యగారిపల్లి చెందిన బ్రహ్మయ్యఆచారి వేటకొడవలితో దాడిచేసిన సంగతి విదితమే. అంతటితో ఆగకుండా తన కుమారుడిని ఎత్తుకుపోవడంతో ఆందోళన చెందిన బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న ఎస్పీ రత్న.. ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్‌తో ప్రత్యేక టీంను ఏర్పాటుచేశారు. డీఎస్పీ తక్షణమే రంగంలోకి దిగి కడప జిల్లా పోలీసులకు సమాచారం అందించారు. స్థానిక పోలీసుల సహకారంతో నిందితుడు బ్రహ్మయ్యఆచారిని భూమయ్యగారిపల్లిలో గంటల వ్యవధిలోనే అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద ఉన్న ఏడేళ్ల బాలుడిని కాపాడారు. బాలుడిని సురక్షితంగా కాపాడినందుకు డీఎస్పీ హేమంత్‌కుమార్, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించిన డీజీపీ రివార్డు ప్రకటించారు.

పింఛన్ పంపిణీలో గొడవ

● సిబ్బంది నిర్లక్ష్యం
● ఓ వర్గంపై మరో వర్గం దాడికి యత్నం
● గొల్లపల్లి ఎస్సీ కాలనీకి భారీగా చేరిన పోలీసులు



గ్రామస్థులకు సర్దిచెబుతున్న పోలీసులు

గాండ్లపెంట, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): పింఛన్ పంపిణీ సందర్భంగా మండలంలోని గొల్లపల్లిలో గొడవ చోటుచేసుకుంది. అధికారుల నిర్లక్ష్యం గ్రామంలో గొడవలకు దారితీసిందని పింఛన్‌దారులు అంటున్నారు. గొల్లపల్లి ఎస్సీ కాలనీలో శనివారం పింఛన్ పంపిణీ చేపట్టారు. ఇంటింటికి వెళ్లి ఇవ్వాల్సిన సిబ్బంది ఒకచోట కూర్చుని పంపిణీ చేశారు. ఓ వ్యక్తి ఆధార్ కార్డులను సేకరించి వరస క్రమంలో పంపిణీ మొదలు పెట్టారు. ఆధార్ కార్డులు తీసుకున్న ఆ వ్యక్తి కార్డులను తారుమారు చేయడంతో గొడవ మొదలయింది. తరువాత గ్రామస్థులు సర్ది చెప్పారు. దీనిపై ఒక వర్గం వారు శనివారం రాత్రి భారీస్థాయిలో మరోవర్గంపై దాడికి ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న పోలీసులు గొడవలు జరగకుండా అడ్డుకున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో మరింత వివాదం కాకుండా ఎన్పీకుంట, తలుపుల, కదిరి ఎస్‌ఐలతోపాటు, ఆయా పోలీసుస్టేషన్ల సిబ్బందిని గొల్లపల్లి పంపించి బందోబస్తు నిర్వహించారు. ఇరువర్గాలకు పోలీసులు సర్దిచెప్పడంతో గొడవలు సద్దుమణిగాయి. ఆదివారం సీఐ నాగేంద్ర ఇరువర్గాలను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి గ్రామంలో ఎలాంటి గొడవలకు దిగుకూడదని హెచ్చరించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. పింఛన్ పంపిణీ సిబ్బంది నిర్లక్ష్యంవల్లే గొడవలు వస్తున్నట్లు ప్రజలు అంటున్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు వలీబాషా, నరసింహుడు తదితరులు పాల్గొన్నారు.

నగర శివారులో హత్య

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం కక్కలపల్లి పంచాయతీ పరిధిలోని హార్మోన్‌సిటీ పక్కనున్న చింతతోపులో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ధర్మవరం మండలం మల్కాపురం గ్రామానికి చెందిన ఎరుకల కాశప్ప(40)మృతదేహం చింతతోపులో లభ్యమైంది. అతడి మొహంపై బండరాతితో మోదడంతో తీవ్ర రక్తగాయాలయ్యాయి. స్థానికులు అటుగా వెళ్లి ఆ మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని రూరల్ సీఐ శేఖర్, నాలుగో పట్టణ సీఐ సాయినాథ్ సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. మృతుడు కక్కలపల్లిలోని టమోట మండీలో ప్యాకింగ్ లేబర్‌గా పనిచేస్తుండేవాడు. సంఘటన జరిగిన స్థలం అనంతపురం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తుందా...?నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు వస్తుందా..?అనే విషయంలో సందిగ్ధం తలెత్తింది. రాత్రి 8గంటల వరకు కేసు ఎవరిదనే విషయం తేలలేదు. చివరకు రూరల్ పోలీసులు ఆ కేసును దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య సౌభాగ్య కొడుకు, కుమార్తె సంతానం. మృతికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.


రిటైర్డ్ ఉద్యోగి ఆత్మహత్య

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): భార్యకు క్యాన్సర్ నయం కాకపోవడం.. కుటుంబంలో కలహాలు తలెత్తడం లాంటి సమస్యలతో మనస్తాపానికి గురైన ఓ విశ్రాంత ఉద్యోగి బలవన్మరణానికి పాల్పడ్డారు. అనంతపురం రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రూరల్ మండల పరిధిలోని పాపంపేట పోస్టల్ శాఖలో పనిచేసి రిటైర్డ్ అయిన శ్రీనివాసులు (67) తన కుటుంబంతో కలిసి నివాసముంటున్నారు. ఈయన భార్య వెంకటసుబ్బమ్మ గత కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతుండేది. వ్యాధి నయం కాలేదు. దీనికి తోడు కుటుంబంలో కలహాలు తలెత్తడంతో మానసికంగా కుంగిపోయిన శ్రీనివాసులు శనివారం రాత్రి ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు అనంతపురం రూరల్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ చిన్నారి మృతి

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): గంజి పడి తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న చిన్నారి మృతి చెందింది. పదిరోజుల క్రితం నగరంలోని రాణినగర్‌కు చెందిన మునీర్‌బేగం తన ఏడాదిన్నర వయసున్న చిన్నారితో ఇంట్లో ఉండగా ...పక్కింట్లో ఉంటున్న హర్షియా ఆడిస్తానని చెప్పి తన ఇంట్లోకి తీసుకెళ్లింది. కొంతసేపటికే వేడిగా ఉన్న గంజి పడి తీవ్రగాయాలకు గురైంది. చిన్నారిని స్థానికంగా ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స అందించారు. మెరుగైన వైద్య చికిత్సల నిమిత్తం కర్నూలుకు తీసుకెళ్ళారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది.

దైవదర్శనం కోసం..
కొండ ఎక్కుతూ వృద్ధుడి మృతి



రుషింగమయ్య కొండ మీద మృతి చెందిన గొడ్ల ప్రకాశ్‌రావు

శింగనమల ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): దైవ దర్శనం కోసం కొండ ఎక్కుతూ గొడ్ల ప్రకాశ్‌రావు(67) అనే వృద్ధుడు గుండెపోటుతో మృతి చెందారు. బంధువులు, పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం గుల్జార్‌పేటకు చెందిన ఆర్యవైశ్య గొడ్ల ప్రకాశ్‌రావు తన భార్య రమాసుందరి, అన్న కుమారుడు కిరణ్‌తో కలసి ఆదివారం శింగనమల వద్ద ఉన్న పురాతన రుషింగమయ్య కొండకు దర్శనం కోసం వెళ్లారు. కొండలో 3 కిలోమీటర్ల వెళ్లిన తరువాత గుండెపోటు రావడంతో కూలిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు పోలీసులకు, 108కు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి వెళ్లేలోపే ప్రకాశ్‌రావు మృతి చెందాడు. మృతదేహాన్ని తీసుకు వెళ్లడానికి కుటుంబ సభ్యులు ఇబ్బంది పడుతుండడంతో పోలీసులు, 108 సిబ్బంది మానవత్వం చాటుకున్నారు. కానిస్టేబుళ్లు నరేష్, రామాంజనేయులు, సాయినాథ్, 108 సిబ్బంది శివ, కేశవ్ మృతదేహాన్ని కొండ నుంచి ఆసుపత్రికి తీసుకు వచ్చారు. వారిని శింగనమల సీఐ కౌలుట్లయ్య, ఎస్‌ఐ విజయ్‌కూమార్ అభినందించారు.

డ్రగ్స్ రహిత రాష్ట్రమే ధ్యేయం

● క్రీడాంధ్రప్రదేశ్‌గా మారుస్తాం - శాప్ చైర్మన్
● స్టేడియం నిర్మిస్తాం : ఎమ్మెల్యే
● ఉత్సాహంగా రన్‌లో పాల్గొన్న యువత



'సే నో టూ డ్రగ్స్' పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, శాప్ చైర్మన్, అహుడా చైర్మన్, రైతులు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో వైసీపీ రాష్ట్రాన్ని గంజాయికి అడ్డాగా మార్చిందని.. డ్రగ్స్ రహిత రాష్ట్రమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. 'సే నో టూ డ్రగ్స్ స్పోర్ట్స్ ఏపీ సాధన' నినాదంతో 'అనంతపురం కోసం పరుగు' కార్యక్రమాన్ని శాప్, ఈగల్, అహుడా, ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్, వీవైబ్ సంస్థలు సంయుక్తంగా ఆదివారం వీ రన్ నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ ఎదుట ఏర్పాటు చేసిన వేదిక వద్ద అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు, అహుడా చైర్మన్ టీసీ వరుణ్, ఏఎస్పీ మల్లికార్జునవర్మ యువతతో కలిసి స్టెప్పులేసి ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ.. గత ఐదేళ్లలో దేశంలో ఎక్కడ గంజాయి దొరికినా వాటి ఆనవాళ్లు ఏపీ నుంచే ఉండేవని, వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని విమర్శించారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న భారీ ఔట్‌డోర్ స్టేడియం నిర్మించి తీరుతామని స్పష్టం చేశారు. శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు మాట్లాడుతూ.. గత ఐదేళ్లలో యథేచ్ఛగా గంజాయి పాఠశాలల నుంచి కళాశాలల వరకు పాకిందని, దీంతో యువత జీవితాలను బలిచేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువగళం పాదయాత్రలో లోకేష్‌కు పలు జిల్లాల ప్రజలు గంజాయిని నియంత్రించాలని కోరారని...అప్పుడే 'గంజాయి వద్దు బ్రో' అనే నినాదాన్ని ఇచ్చారని...ఇప్పుడు అదే అమలు చేస్తున్నామని అన్నారు. జిల్లాలో స్టేడియం నిర్మించి క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సాహిస్తామని తెలిపారు. క్రీడాంధ్రప్రదేశ్‌గా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన క్రీడాపాలసీ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అహుడా చైర్మన్ టీసీ వరుణ్ మాట్లాడుతూ.. డ్రగ్స్‌కు యువత బానిసలు కాకుండా ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఏఎస్పీ మల్లికార్జునవర్మ మాట్లాడుతూ.. గంజాయి రహిత సమాజస్థాపనకు యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సే నో టూ డ్రగ్స్... కార్యక్రమాన్ని శాప్, ఎలైట్ యాంటీనార్కటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్-ఈగల్, అహుడా, ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ సహకారంతో నిర్వహించడం సంతోషంగా ఉందని వీ వైబ్ సంస్థ అధినేత సజ్జ రాఘవీణ తెలిపారు. అనంతరం జెండా ఊపి ప్రారంభించిన 10కె, 5కె, 3కె రన్‌లో పాల్గొన్న యువతను అభినందించారు. కార్యక్రమంలో జైకిసాన్ ఫౌండేషన్ చైర్మన్ ఓబుళేసు, ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ సుధాకర్, ఎస్కే యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ హరికృష్ణ, డీఎస్‌డీఓ ఉదయ్‌భాస్కర్, కోచ్‌లు అనిల్‌కుమార్, ఆలీ, నరేష్‌కుమార్, లక్ష్మి, సంధ్య, జెబవుల్లీ, రాఘవేంద్ర, గ్రీన్ ఆర్మీ ఏజీ అనిల్‌కుమార్, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.



రన్‌లో ఎమ్మెల్యే, శాప్ చైర్మన్, అహుడా చైర్మన్

గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి
తిరునాళ్ల ప్రారంభం



పూజలందుకుంటున్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

గార్లదిన్నె, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా పేరుగాంచిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి తిరునాళ్లు ప్రారంభమయ్యాయి. ప్రతి ఏడాది మాఘమాసంలో స్వామి తిరునాళ్లు నాలుగు వారాల పాటు నిర్వహిస్తారు. అందులో భాగంగా ఈ ఏడాది మాఘమాసం మొదటి ఆదివారం తిరునాళ్లు ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకుడు రామాచార్యులు తెల్లవారుజామున స్వామిని వివిధ పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేసి ఏకవార రుద్రాభిషేకం, సహస్రనామార్చన తదితర పూజలు నిర్వహించారు. స్వామిని దర్శించుకునేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. కోర్కెలు నెరవేరిన భక్తులు స్వామికి బియ్యం, బేడలతో పాటు వివిధ రూపాల్లో కానుకలు సమర్పించుకున్నారు. ఆలయం అవరణంలో ఉన్న 108 శివలింగాలను, సాయిబాబాలను భక్తులు దర్శించుకున్నారు. భక్తులకు గాండ్ల సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ విశాలాక్షి, భాస్కర్ ఫర్టిలైజర్ ఎండీ విజయ్‌భాస్కర్ దంపతులు ప్రసాదం అందచేశారు.



108 శివలింగాలకు ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

రేపు బూదగవిలో రథసప్తమి వేడుకలు



సూర్యభగవానుడి మూలవిరాట్

ఉరవకొండ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదగవి గ్రామంలో వెలసిన సూర్యనారాయణ స్వామి ఆలయంలో మంగళవారం రథసప్తమి వేడుకల నిర్వహణకు ఆలయ కమిటీ సన్నాహాలు చేస్తోంది. దక్షిణముఖంగా ఉన్న ఏకైక సూర్యుడి ఆలయంగా గుర్తింపు పొందింది. సూర్యుడి ఆలయాల్లో రాష్ట్రంలో రెండోదిగా, దక్షిణభారతదేశంలో మూడోదిగా ప్రశస్తి పొందింది. ఈ ఆలయాన్ని 13వ శతాబ్దంలో చోళరాజులు నిర్మించినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. ఈ ఆలయంలో పూజ, యజ్ఞం, సూర్య నమస్కారాలు, చేసినా, చేయించినా సర్వ రోగ నివారణ జరుగుతుందని, మృత్యు భయం ఉండదని భక్తుల విశ్వాసం. ఆలయంలో మూలవిరాట్‌కు సాష్టాంగ నమస్కారం చేస్తున్నట్లు ఉన్న హనుమంతుడి రూపం నేలపై ఉండడం ఇక్కడ విశేషం. ఇది రెండు ఆలయాల సముదాయం. దీనికి తూర్పునకు అభిముఖంగా రామలింగేశ్వరాలయం, ఎడమవైపున దక్షిణముఖంగా సూర్యనారాయణ స్వామి దేవాలయం నిర్మించారు. ఈ రెండు ఆలయాలను కలుపుతూ వాటికి ఎదురుగా నాలుగు స్తంభాలతో మండపం నిర్మించారు. మాఘ శుద్ధ సప్తమి రోజే రథసప్తమి. ఆ రోజునే సూర్య జయంతిని జరుపుకుంటారు. సూర్యనారాయణస్వామి ఆలయంలో సోమవారం మహాగణపతిపూజ, గోపూజ, గంగపూజ, కలశస్థాపన, దీక్షహోమాలు నిర్వహిస్తారు. 4వ తేదీన రథసప్తమి సందర్భంగా చాయా ఉషసమేత సూర్యనారాయణస్వామి కల్యాణోత్సవం, అష్టోత్తర శత క్షీర కుంభాభిషేకం, మహాసౌర అరుణపూర్వక సూర్యనమస్కారాలు నిర్వహిస్తారు. భక్తుల సౌకర్యార్థం క్యూలైన్లు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో తెలిపారు.



సూర్యనారాయణస్వామి ఆలయం

200 గ్రాముల గంజాయి స్వాధీనం

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎక్సైజ్ పోలీసులు ఆదివారం పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. జేఎన్‌టీయూ సమీపంలోని శ్మశాన వాటిక వద్ద షికారి విజయ్ అనే వ్యక్తి నుంచి 200 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఆత్మకూరు మండలం గొరిదిండ్ల తండాలో ఇద్దరు వ్యక్తుల నుంచి 10 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకొని, వారిని అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సునంద, ఎస్‌ఐ జయనరసింహ, సిబ్బంది పాల్గొన్నారు.

మెడికల్ రెప్‌ల కార్యవర్గం ఎన్నిక

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మెడికల్, సేల్స్ రెప్రజెంటేటివ్స్ యూనియన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో మెడికల్ రెప్స్ యూనియన్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా అమర్‌నాథ్, ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్, కోశాధికారిగా విజయనాయుడు, ఉపాధ్యక్షులుగా మంజునాథ్, నరేంద్ర, సహాయ కార్యదర్శులుగా కదిరప్ప, రామాంజనేయులును ఎన్నుకున్నారు. ఐఎంఏ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఆదర్శరెడ్డి, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగారెడ్డి, లింగమయ్య పాల్గొన్నారు.

మద్దలచెరువులో ఎలుగుబంట్ల సంచారం




బ్రిడ్జికింద దాగి ఉన్న ఎలుగుబంట్లు


కనగానపల్లి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దలచెరువు గ్రామ వద్ద శనివారం రాత్రి రెండు ఎలుగుబంట్లు హల్‌చల్ చేశాయని రైతులు తెలిపారు. గ్రామ శివారులోని మద్దలచెరువు నుంచి భానుకోట మధ్య ఉన్న హంద్రీనీవా కాలువ బ్రిడ్జి కింద దాగి ఉన్నాయన్నారు. గత నెల రోజులుగా రెండు ఎలుగుబంట్లు గ్రామ సమీపంలో సంచరిస్తున్నాయని వివరించారు. బ్రిడ్జి కింద ఎలుగుబంట్లు దాగున్నాయని ఆదివారం గుర్తించిన స్థానికులు అధికారులకు సమాచారం అందించారు. అయినప్పటికీ అధికారులు ఏమీ పట్టించుకోలేదని తెలిపారు. పొలాలకు వెళ్లాలంటే రైతులు భయపడుతున్నారు.

ఉద్యోగ విరమణ ప్రయోజనాలు ఎప్పుడో..?

● వైసీపీ పాలనలో రిటైర్డ్ ఉద్యోగులకు మొండిచేయి
● కూటమి ప్రభుత్వంపై ఆశలు



ధర్మవరం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో రాష్ట్ర ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచింది. విశ్రాంత ఉద్యోగులకు అందాల్సిన ఆర్థిక ప్రయోజనాలు గతఐదేళ్ల కాలంలో అందలేదంటూ పలువురు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా పెండింగ్‌లో ఉన్న ఆర్థిక ప్రయోజనాలు అందేనా అని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ హయాంలో ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాల కోసం కూడా ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాన్ని 1, 2 తేదీల్లో అందిస్తోంది. అదేవిధంగా తమకు అందాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు పదవీవిరమణ ఉద్యోగులు కోరుతున్నారు. గత ప్రభుత్వ విధానాలతో విసిగిపోయిన చాలా మంది స్వచ్ఛంద పదవీ విరమణ(వీఆర్ఎస్) చేసిన సంఘటనలు ఉన్నాయి. వారిని మినహాయిస్తే గత ప్రభుత్వంలో పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనాలు నేటికి అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. 30 ఏళ్లలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని వచ్చేజీతంతో కుటుంబాన్ని నెట్టుకొస్తూ పదవీ విరమణ సమయంలోవారు వచ్చే డబ్బుతో తమ ఆశలు తీరుతాయని ఎంతో ఆతృతగా ఉంటారు. వచ్చే డబ్బుతో పిల్లల చదువులు, వివాహాలు, సొంతిటి నిర్మాణం నెరవేర్చుకోవాలని కలలు కంటుంటారు. ఆ కలలను గత ప్రభుత్వం కల్లలు చేసిందని విశ్రాంత ఉద్యోగులు మండిపడుతున్నారు.



బెనిఫిట్స్ కోసం ఎదురు చూస్తున్నా

నేను గత ఏడాది ఏప్రిల్‌లో పదవీ విరమణ పొందాను. నాకు ఇప్పటి వరకు పీఎఫ్, గ్రాట్యుటీ, సీసీఎస్ మాత్రమే అందాయి. మిగిలిన బెనిఫిట్స్ ఇంతవరకు అందలేదు. నేను ఉద్యోగంలో చేరినప్పుడు 10డీ ఫారంలో కొన్ని అంశాలను తప్పుగా పొందుపరిచారు. వాటిని సరిదిద్దుకోవడానికి కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారు. నాలాంటి వారు ఉమ్మడి జిల్లాలో ఎంతో మంది ఇబ్బంది పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి బెనిఫిట్స్ అందేవిధంగా చూడాలి.

- సూరీడు, ఆర్టీసీ రిటైర్డ్ డ్రైవర్

జిల్లాలో స్టేడియం నిర్మిస్తాం

● శాప్ చైర్మన్, ఎమ్మెల్యే

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కచ్చితంగా భారీ ఔట్‌డోర్ స్టేడియం నిర్మిస్తామని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పష్టం చేశారు. ఆంధ్రజ్యోతిలో ఆదివారం ప్రచురితమైన 'అస్తవ్యస్తం' అనే కథనానికి వారు స్పందించారు. వీ రన్‌లో పాల్గొన్న శాప్ చైర్మన్, ఎమ్మెల్యే స్పందిస్తూ... గత వైసీపీ పాలనలో అస్తవ్యస్తంగా మారిన క్రీడాశాఖను గాడిలో పెడతామన్నారు. ఎన్నో ఏళ్ళుగా జిల్లా ప్రజలు ఎదురుచూస్తున్న భారీ ఔట్‌డోర్ స్టేడియం నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్నామని తెలిపారు. ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల పేరుతో నిధుల దుర్వినియోగానికి పాల్పడిన గత డీఎస్‌డీఓ నరసింహారెడ్డినుంచి ప్రతి పైసా కక్కిస్తామని పేర్కొన్నారు. నార్పల స్టేడియంలో క్రీడాసామగ్రి క్రీడాకారులకు పంపిణీ చేస్తామని వివరించారు. కోచ్‌ల నియామకంపై త్వరలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.

వడ్డె ఓబన్నను స్ఫూర్తిగా తీసుకోవాలి

● విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే పరిటాల సునీత



వడ్డె ఓబన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర సమరయోధుడు వడ్డె ఓబన్నను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని పేరూరు గ్రామంలో వడ్డె ఓబన్న విగ్రహాన్ని ఆమె ఆవిష్కరించారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ సత్యసాయిజిల్లా అధ్యక్షుడు అంజనప్పకు వడ్డెర కులస్థులు ఘన స్వాగతం పలికి భారీ ఊరేగింపు నిర్వహించారు. వడ్డెర మహిళతో కలిసి పరిటాల సునీత కలశం ఎత్తుకుని ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ...బ్రిటీష్ వారి ఆగడాలు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన యోధుడు వడ్డె ఓబన్న అన్నారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి సైనిక అధ్యక్షుడిగా పనిచేశారని, రైతులపై బ్రిటీష్ వారు విధించి పన్నులకు వ్యతిరేకంగా పోరాటం చేశారని గుర్తుచేశారు. 39 ఏళ్ల వయస్సులోనే వీరమరణం పొందారన్నారు. టీడీపీ వడ్డెర్లకు మొదటి నుంచి రాజకీయ ప్రాధాన్యం కల్పించిందన్నారు. వడ్డెర్లు మరింత రాజకీయంగా, ఆర్థికంగా ముందుకువెళ్లాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులతో పాటు వడ్డెర సంఘం నాయకులు, కులస్థులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయమే శరణ్యం



మాట్లాడుతున్న నాగరాజు

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మానవాళి మనుగడకు ప్రకృతి వ్యవసాయమే శరణ్యమని దక్షణభారత ప్రకృతి వ్యవసాయ శిక్షణా నిపుణుడు బసన్‌పల్లి టి. నాగరాజు తెలిపారు. ఆదివారం కుటాగుళ్ల మున్సిపల్ హైస్కూల్ మహావతారం బాబాజీ కాంతి జ్ఞానకేంద్రం, ఎర్త్ 360 స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రసాయనిక ఎరువులు, పురుగుమందుల ప్రభావం తగ్గించేందుకు, ఆరోగ్యకరమైన ఉత్పత్తులు పెంపొందించేందుకు ప్రకృతి వ్యవసాయమే మార్గం అన్నారు. ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంటలు, వాతావారణం నెలకొంటుందన్నారు. రసాయనిక ఎరువుల వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయని, భూసారం తగ్గిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా ఆర్గానిక్ సెల్ రాష్ట్ర కన్వీనర్ చింతా శరత్‌కుమార్‌రెడ్డి, మండల ఏఓ శ్రీనివాసరెడ్డి, ఎర్త్ 360 స్వచ్ఛంద సంస్థ దినేష్, రెడ్స్ భానుజా, వాసన్ ప్రోగ్రామ్ అధికారి ఉత్తప్ప, శైలజా, గంగాధర్‌నాయక్, ఆదర్శరైతు వెంకటరెడ్డి, రైతు సంఘం శంకర్, ప్రతాప్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు కష్టాలు..!

మరువ పారితే అంతే

- వర్షాలు వస్తే 20 గ్రామాలకు రాకపోకలు బంద్
- కల్వర్టుల పైనుంచి నీటి ప్రవాహం
- పట్టించుకోని పాలకులు, అధికారులు



కల్వర్టు మీదుగా పారుతున్న చిన్నూరువంక (ఫైల్)

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): వర్షాలు వచ్చి.. ధర్మవరం చెరువు మరువ పారితే చాలు.. సుమారు 20 గ్రామాలకు రాకపోకలు బంద్ అవుతాయి. ఆ గ్రామాల నుంచి ధర్మవరం పట్టణానికి వెళ్లాలంటే ధర్మవరం చెరువు మరువ పారే రహదారి ఒకటే మార్గం. మరువలు నీరు.. తక్కువ ఎత్తులో ఉన్న కల్వర్టుపై నుంచి పారుతుండటంతో.. ఆ గ్రామాలకు రాకపోకలు ఆగిపోతాయి. ఏళ్ల తరబడి ఇదే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వాలు మారినా.. పాలకులు మారినా.. ఈ సమస్య పరిష్కారం కాలేదు. నేటికీ ఆ గ్రామాలకు రాకపోకలకు మాత్రం మరువ నీరు వెళ్లే కల్వర్టు మీదే నుంచే సాగుతోంది.

● వంక పారితే.. బంద్ :

మండలంలోని ధర్మపురి, రావులచెరువు, చిన్నూరుబత్తలపల్లి, ఆకుతోటపల్లి, యర్రగుంటపల్లి, వెంకటతిమ్మాపురం, రావులచెరువుతండా గ్రామాలతో పాటు మరిన్ని గ్రామాల ప్రజలు ధర్మవరం పట్టణానికి రావాలంటే చిన్నూరు వంక పై రావాల్సి ఉంటుంది. సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు ఆయా గ్రామాల ప్రజలు ధర్మవరం పట్టణానికి వచ్చి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. పాడిరైతులు, భవనకార్మికులు, వ్యాపారులు, విద్యార్థులు, రైతులు తదితరులు అవసరాల నిమిత్తం ధర్మవరానికి రావాల్సి ఉంటుంది. అయితే వంక కింద చిన్నపాటి బ్రిడ్జి (కల్వర్టు) మాత్రమే ఉంది. ధర్మవరం చెరువు మొదటి మరువ పారితే ఆ నీరంతా బ్రిడ్జిపై పారుతోంది. గతేడాది కూడా భారీ వర్షాలు రావడంతో ఆ వంకపై ఉధృతంగా నీరు పారాయి. దీంతో ఆ గ్రామాలకు వారంరోజుల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. వంక పారే వద్ద ఉన్న బ్రిడ్జిని ఎత్తులో నిర్మిస్తే రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు ఉండదని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా బ్రిడ్జిని నిర్మించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

● చిత్రావతి వంక వద్ద ఆగచాట్లు

తమ గ్రామానికి వెళ్లాలంటే తుమ్మల, తిప్పేపల్లి గ్రామాల మధ్య చిత్రావతి వంక పారుతోంది. ఈ వంక ఉధృతంగా పారితే బ్రిడ్జిపై నీరు పారుతోంది. రహదారి కన్నా బ్రిడ్జి కిందకు ఉండటంతో భారీ వర్షాలకు బ్రిడ్జిపై నీరు పారుతుంది. దీంతో గ్రామస్థులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. గతేడాది కురిసిన వర్షాలకు బ్రిడ్జి పాచిపట్టి ట్రాక్టర్లు, ద్విచక్రవాహనదారులు కొట్టుకుపోయాయి. స్థానికుల సహాయంతో వాహదారులు ప్రాణాలతో బయటపడ్డారు. వాహనాలు మాత్రం కొట్టుకుపోయాయి.



చిన్నూరు వంక దారి



చిత్రావతి వంకలో కొట్టుకుపోయిన ట్రాక్టర్ (ఫైల్)

వర్షం వస్తే భయం



వర్షం వస్తే చాలు ప్రయాణం చేయాలంటే భయంగా ఉం టుంది. మా గ్రామం నుంచి తుమ్మల, ధర్మవరంకు వెళ్లాలంటే చిత్రావతి బ్రిడ్జిని దాటుకోని పోవాలి. అయితే బ్రిడ్జి రోడ్డు కన్నా కిందకు ఉండటంతో నీరంతా బ్రిడ్జిపై పారుతుంది. దీంతో బ్రిడ్జిపై వెళ్లాలంటే భయంగా ఉంటుంది. గతంలో ప్రమాదాలు జరిగాయి. అధికారులు, పాలకులు స్పందించాలి.

-వెంకటనారాయణ, తిప్పేపల్లి వాసి

ఇబ్బందులు పడుతున్నాం



మా గ్రామానికి వెళ్లాలంటే చిన్నూరువంక మీదుగా ధర్మపురి నుంచి వెళ్లాలి. వర్షం వస్తే ధర్మవరం చెరువు మరువ పారితే చెరువు కింద వెళ్లలేం. అయితే చిన్నూరు వంక మీదుగా వెళ్లాలన్న నీరు అధికంగా పారితే రాకపోకలు నిలిచిపోతాయి. రహ దారి ఎత్తులో ఉండటంతో చాలా ఇబ్బందులు పడుతు న్నాం. అక్కడ ఎటువంటి సైడ్‌వాల్స్ లేవు. గతంలో నీరు ఎక్కువగా రావడంతో బైకులు కొట్టుకుపోయాయి. ఎప్పుడూ వర్షంవచ్చినా, చెరువు మరువ పారినా మా గ్రామాలకు రాకపో కలు నిలిచి పోయి జీవనోపాధి కోల్పోవుతున్నారు. అధికారులు స్పందించి చిన్నూరు వంక వద్ద శాశ్వత బ్రిడ్జిని ఏర్పాటు చేయాలి

-సుబ్బరాయుడు, చిన్నూరుబత్తలపల్లి

న్యూస్ బాక్స్

రేపు రథసప్తమి మహోత్సవం

ధర్మవరం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో మంగళవారం రథసప్తమి మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ చెన్నంశెట్టి జగదీశ్, ఈఓ వెంకటేశులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం సూర్య ప్రభ, శేష, గరుడ, హనుమత్, కల్పవృక్ష, సర్వభూపాల, చంద్రప్రభ సేవలు ఉంటాయన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ధర్మవరం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ప్రమోద్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు వారివారి సమస్యలపై ఫిర్యాదులు ఇవ్వాలని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రత్యేక తరగతులకు అరకొర స్పందన



గాండ్లపెంట: ప్రత్యేక తరగతులకు హాజరైన విద్యార్థులు

గాండ్లపెంట, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలో పదో తరగతి విద్యార్థులకు జిల్లా పరిషత్ పాఠశాలల్లో ప్రభుత్వం తలపెట్టిన ప్రత్యేక తరగతులకు ఆదివారం అరకొర స్పందన లభించింది. కటారుపల్లి, రెక్కమాను, గాండ్లపెంట, తుమ్మలబైలు, నీరుకుంట్లపల్లి పాఠశాలల్లో పది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. హాజరైన విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వసతినీ కల్పించారు. అయినా ఈ తరగతుల పట్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆసక్తి చూపలేదు. ఆయా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులను ప్రత్యేక తరగతులకు పంపడానికి తల్లిదండ్రులు సహకరించాలని, అప్పుడే మంచి మార్కులతోపాటు ఉత్తీర్ణత శాతం పెరుగుతుందని సూచించారు.

జనసేన ఆత్మీయ సమావేశం



సమావేశంలో పాల్గొన్న జనసైనికులు

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్జీవో హోమ్‌లో జనసేన పట్టణాధ్యక్షుడు చలపతి అధ్యక్షతన ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి భైరవప్రసాద్ మాట్లాడుతూ.. ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పట్టణంలోని 36 వార్డుల్లో సమస్యలను గుర్తించి, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా జనసైనికులు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో జనసేన శివశంకర్, కుటాల లక్ష్మణ్, ఆంజిబాబు, ప్రతాప్, మహేష్, రాజేంద్రప్రసాద్, రెడ్డెమ్మ, మంగమ్మ, గంగరాజు, లోకేష్, హరీష్ పాల్గొన్నారు.

7న హైదరాబాద్‌కు తరలిరండి

ధర్మవరం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందక్రిష్ణ మాదిగ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శుక్రవారం తలపెట్టిన లక్షల డప్పులు వేల గొంతుల కార్యక్రమానికి తరలిరావాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి సామ్రాట్ మధు, సీనియర్ నాయకులు కేశగాళ్ల శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం స్థానిక కళాజ్యోతి సర్కిల్‌లో అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను అవిష్కరించిన వారు మాట్లాడారు. ప్రభుత్వాలు వెంటనే ఎస్సీ వర్గీకరణ కార్యక్రమాన్ని చేపట్టాలనే డిమాండ్‌తో ఈ కార్యక్రమాన్ని తల పెట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కేశగాళ్ల వెంకటేశ్, నాయకులు గజ్జల రామాంజినేయులు, బాలకృష్ణ, వీరయ్య, నాగేంద్ర పాల్గొన్నారు.

● ఓబుళదేవరచెరువు: ఎస్సీ వర్గీకరణలో భాగంగా శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించే లక్ష డప్పు, వేల గొంతులు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ నాయకులు కోరారు. ఆదివారం స్థానికంగా వారు మీడియాతో మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందక్రిష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. ఈసమావేశంలో బావన్న, ఆంజనప్ప, కత్తి ఆనంద్, ఇనగలూరు లక్ష్మణ్, క్రిష్టప్ప, లక్ష్మీపతి, ఎంఇఎఫ్ నరసింహులు, రమణ, అక్కులప్ప, డాక్టర్ రామమోహన్ పాల్గొన్నారు.

నేటికీ సచివాలయంలో జగన్ ఫొటో



పోట్లమర్రి సచివాలయం ప్రధాన ముఖ ద్వారం వద్ద

బత్తలపల్లి ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): నేటికీ కొన్ని సచివాలయాల్లో సిబ్బంది జగన్‌పై స్వామి భక్తి చూపుతూ తూలుతూనే ఉన్నారు. మండలంలోని పోట్లమర్రి సచివాలయం ప్రధాన ద్వారం పక్కన అత్యవసర నంబర్లు కలిగిన బోర్డులో జగన్ ఫొటో ఉన్న స్టిక్కర్ ఉం ది. ఇది సచివాలయమా, వైసీపీ కార్యాలయమా అనే అనుమానం వచ్చేలా ఇంకా జగన్ ఫొటోలు, వైసీపీ రంగులు కలిగిన టోపీలు, ఆ పార్టీ ప్యాకెట్ క్యాలెండర్లు ఉన్నాయి.

ఏ వీధిలో చూసినా చెత్తే..!

కొత్తచెరువు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఎక్కడ చూసినా చెత్తదిబ్బలే దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని ప్రతినెలా మూడో శనివారం నిర్వహిస్తోంది. అయితే అధికారులు తూతూ మంత్రంగా ఆ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారులు వచ్చినప్పుడు మాత్రమే ఒక ప్రాంతాన్ని ఎంచుకొని.. అక్కడ హడావుడి చేస్తున్నారే తప్పా అన్ని వీధులను శుభ్రం చేయించడం లేదు. బీసీ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి ప్రక్కన కొన్ని నెలలుగా చెత్తాచెదారం పేరుకుపోయింది. దీంతో ఆ ప్రాంతం దుర్గంధం వస్తోందని సమీప ప్రజలు వాపోతున్నారు. అదేవిధంగా ధర్మవరం ప్రధాన రహదారి పక్కన విజయనగర్ కాలనీ, ఉర్దూ పాఠశాల, మరువ అంజనేయస్వామి ఆలయం వద్ద చెత్తాచెదారం పేరుకుపోయింది. మురుగు నీరు రోడ్లపై పారుతోందని పలు కాలనీల వాసులు వాపోయారు. పంచాయతీ అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.



బీసీ కాలనీలోకి వెళ్లే ప్రధాన రహదారి పక్కన పడి ఉన్న చెత్త



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

ఘనంగా కాకతీయ పాఠశాల వార్షికోత్సవం

ధర్మవరం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక కాకతీయ ఇంగ్లీషు మీడియం పాఠశాల 15వ వార్షికోత్సవాన్ని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు, పట్టణ టూటౌన్ సీఐ రెడ్డప్ప, ఎంఈఓ-1 రాజేశ్వరి, ఎంఈఓ-2 గోపాల్‌నాయక్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే సామాజిక స్పృహ, ఇతరులకు సహాయం అందించే గుణాలను పెంపొందించుకోవాలన్నారు. గత ఏడాది 10 ఫలితాలలో 594 మార్కులు సాధించిన నిత్యశ్రీని అభినందించారు. ఎంఈఓలు మాట్లాడుతూ.. విద్యార్థులు సెల్‌ఫోన్ల వినియోగం తగ్గించుకొని.. చదవడంపై శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఫౌండర్ మేడాపురం రామిరెడ్డి, చెన్నక్రిష్ణమ్మ, కరస్పాండెంట్ శెట్టిపి నిర్మలాదేవి, డైరెక్టర్లు శెట్టిపి సూర్యప్రకాశ్‌రెడ్డి, శెట్టిపి పద్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మడివాల మాచిదేవుని జయంతి



ధర్మవరం : అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకులు

ధర్మవరం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): రజకుల కుల దైవమైన మడివాల మాచిదేవుని జయంతి వేడుకలను రజక సంఘం నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక షిర్డీసాయిబాబా ఆలయ సమీపంలో గంగమ్మ ఆలయం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో రజక సంఘం నాయకులు, టీడీపీ నాయకులు మడివాల మాచిదేవుని చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా శ్రీకృష్ణదేవరాయల విగ్రహం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు ప్రారంభించారు. ఇందులో ఏపీ సీడ్స్ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, టీడీపీ రజక సాధికార సమితి హిందూపురం పార్లమెంట్ కన్వీనర్ మాల్యవంతం నారాయణస్వామి, టీడీపీ నాయకులు మాధవరెడ్డి, జైలర్ వెంకటేశ్, కుంటిమద్ది ముత్యాలు, కృష్ణాపురం మస్తానప్ప, మాల్యవంతం వెంకటేశ్, మాల్యవంతం మురళి, సాకే రమేశ్ పాల్గొన్నారు.

● కదిరిఅర్బన్: పట్టణంలోని సైదాపురం చాకల ఐలమ్మ దోబీఘాట్ వద్ద ఆదివారం మడివాల మాచర్ల దేవ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళ్లు అర్పించారు. ఈకార్యక్రమంలో ఆంధ్రప్రదేశం రజక సంఘం నాయకులు బాపనపల్లి శివప్ప, శివయ్య, హరిప్రసాద్, రాధమ్మ, నారాయణ, శంకర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహాల పునఃప్రతిష్ఠ



నవగ్రహాలకు క్షీరాభిషేకం చేస్తున్న ప్రజలు

ధర్మవరం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక లోనికోటలో గుర్రప్పస్వామి ఆలయాన్ని పునర్నిర్మించారు. ఆదివారం ఆ ఆలయంలో విగ్రహాల పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఈ సందర్భంగా గంగపూజ, కలిస్థాపన, నవగ్రహ, అంకురార్పణం, అఖండ దీపారాధన తదితర కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. విగ్రహాలకు భక్తులు పాలాభిషేకం నిర్వహించారు. సోమవారం పట్టణ వీధుల్లో స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు చంద్ర తెలిపారు.

నేడు విగ్రహ ప్రతిష్ఠ



ప్రత్యేక పూజలు చేస్తున్న పురోహితులు

తనకల్లు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముళ్లోలపల్లి సమీపంలో నల్లగంగమ్మ దేవాలయంలో సోమవారం అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. దీంతో ఈ ఆలయంలో శనివారం నుంచి ప్రత్యేక హోమాలు, పూజలను పురోహితులు నిర్వహిస్తున్నారు. సోమవారం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హాజరవుతున్నట్లు తెలుగు యువత అధ్యక్షుడు కావడి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. నల్లగుట్లపల్లి, మబ్బువారిపల్లి, ముళ్లోలపల్లితో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు ఈ పూజల్లో పాల్గొంటున్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

ధర్మవరం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక 29వ వార్డు డీఎల్ఆర్ కాలనీకి చెందిన పుల్ల నాగరత్నమ్మ(65) ఆదివారం అనారోగ్యంతో మరణించారు. అంత్యక్రియలకు డబ్బులు లేక ఆమె భర్త నాగభూషణం ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న చేనేత ప్రముఖుడు, టీడీపీ నాయకులు సంధారాఘవ రూ.8 వేలు ఆర్థిక సాయం అందించారు. ఆ నగదును టీడీపీ నాయకులు మృతురాలి భర్తకు అందజేశారు.

కంటి వైద్య శిబిరం

ధర్మవరం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వబాలుర ఉన్నతపాఠశాల ఆవరణంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో 96 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా ఇందులో 36 మంది శస్త్రచికిత్సలకు ఎంపికైనట్టు యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు శీలానాగేంద్ర తెలిపారు.

క్రైం న్యూస్..

వ్యక్తి అనుమానాస్పద మృతి



కిష్టప్ప (ఫైల్)

బత్తలపల్లి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండ లంలోని కోడేకండ్ల గ్రామానికి చెందిన మతి స్థిమితం లేని కిష్టప్ప (60) అనుమా నాస్పద స్థితిలో మరణించాడు. ఆదివారం అతని మృ తదేహం మండలంలోని చిన్నయకుంటప ల్లి సమీపంలోని రైలు పట్టాల సమీపంలో పడి ఉండటాన్ని గమనించిన గొర్రెల కాపర్లు విష యాన్ని రైల్వే స్టేషన్ మాస్టర్‌కు తెలిపారు. రై ల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతుని.. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. కిష్టప్పకు భార్య, కుమారుడు ఉన్నారు.

ఘర్షణలో ఇద్దరికి గాయాలు

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్లూరు లో భూ విషయంలో దాయాదులు ఘర్షణ పడటంతో ఇద్దరు గాయపడ్డారు. గిరకచెన్నప్ప, కాటమయ్య, కేశవులు అన్నదమ్ములు. వీరికి గొట్లూరు పొలంలో 557-1సర్వేనెంబర్‌లో ఐదు ఎకరాలు భూమి ఉంది. వీరికి దాయాదులైన పెద్దచెన్నప్ప, చిన్నచెన్నప్ప తమకు ఆ భూమిలో భాగం ఉందని కోర్టును ఆశ్రయించారు. ఆ విషయంల కోర్టులో ఉండగా గిరకచెన్నప్ప, కాటమయ్య, కేశవులు ఆ భూమిని ధర్మవరానికి చెందిన వారికి అమ్మేశారు. ఈ విషయం తెలుసుకున్న పెద్ద చెన్నప్ప, చిన్నచెన్నప్ప ఆదివారం అడగటానికి వెళ్లి గొడవపడ్డారు. దాడులు చేసుకున్నారు. ఈ దాడిలో గిరక చెన్నప్ప, కేశవు గాయపడ్డారు. వారిని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేపట్టారు.

గౌనిపల్లిలో పగలే చోరీ

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): పట్టపగలు చోరీలు జరుగుతూనే ఉన్నాయి. ఇటీవల బంగారు గొలుసు చోరీలతో పాటు మండలంలోని ప్రధాన రహదారిలో ఒకే రాత్రి మూడు దుకాణాల్లో చోరీలు జరిగిన విషయం తెల్సిందే. ఇది మరవక ముందే మండలంలోని గౌనిపల్లిలో ప్రధాన రహదారి వద్ద హైస్కూల్ ఎదురుగా నివాసమున్న మీసాల సోముశేఖర్ నివా సంలో ఆదివారం పట్టపగలే చోరీ జరిగింది. అతను తన కుటుంబ సభ్యులతో కలిసి.. కదిరి రూరల్ మండలంలోని ఎర్రదొడ్డి గంగమ్మ దర్శనానికి ఆదివారం వెళ్లామన్నారు. దీన్ని అదునుగా తీసుకున్న దుండగులు.. అతని ఇంటి తాళాలు పగలకొట్టి, రూ.2.50 లక్షలు నగదు దోచుకెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చిన సోముశేఖర్ ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించి.. పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గంటల వ్యవధిలో కేసు ఛేదింపు

బత్తలపల్లి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూర్యచంద్రపురం గ్రామానికి చెందిన కుళ్లాయప్ప, అతని భార్య గంగాభవాణి ఆదివారం గొడవ పడ్డారు. గంగాభవాణి.. తన ముగ్గురు పిల్లలతో వెళ్లిపోయింది. కుళ్లాయప్ప డయల్ 100కు ఫిర్యాదు చేశాడు. ఎస్పీ రత్న వెంటనే బత్తలపల్లి పోలీసులను అలర్ట్ చేశారు. బత్తలపల్లి ఎస్ఐ సోమశేఖర్, ఏఎస్ఐ విజయకుమార్, కానిస్టేబుల్ గోపాల్‌తో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు. గంగాభవాణి పులివెందులలోని మేనఅత్త ఇంటిలో ఉన్నట్లు గుర్తించి.. అక్కడి వెళ్లి.. ఆమెతో పాటు ముగ్గురి పిల్లలను బత్తలపల్లి పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసును ఆరు గంటల్లోనే చేధించిన సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డు ప్రకటించారు.

'ఉపాధి హామీ'కి 20 ఏళ్లు

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించి 20 సంవత్స రాలు పూర్తయిన సందర్భంగా స్థానిక ఉపాధిహామీ కార్యాలయంలో ఏపీఓ అనిల్ కుమార్‌రెడ్డి, సిబ్బం ది ఆదివారం కేక్ కట్ చేశారు. ఏపీఓ మాట్లాడు తూ... ఈ పథకాన్ని 2006 ఫిబ్రవరి 2న ఉమ్మడి జిల్లాలోని నార్పల మండలం బండ్లపల్లి గ్రామంలో నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ప్రారంభించారని గుర్తుచేశారు. ఉపాధిహామీ పథకం వల్ల గ్రామాల అభివృద్ధి చెందడటంతో పాటు కూలీలు ఆర్థికాభి వృద్ధి సాధించారన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో సచివా లయ భవనాలు, సీసీ రోడ్లు, బీటీ రోడ్లు నిర్మాణాలు, మౌలిక వసతుల కల్పన కోసం ఈ పథకం ఎంతోగా నో దోహదపడు తోందన్నారు. ఈ కార్యక్రమంలో టీఏలు చంద్రకళ, భారతి, సీఓలు లక్ష్మీ, లక్ష్మీనారా యణ, ఏఫ్ఏలు సదాశివ, మల్లేనిపల్లి చంద్ర, విశ్వ నాథ్, చంద్రశేఖర్, అశోక్, నిమ్మలకుంట చంద్ర శేఖ ర్, పురుషోత్తం, జయకృష్ణ, హేమంత్ పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న సిబ్బంది

ఘనంగా వసంత పంచమి

బుక్కపట్నం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): వసంత పంచమిని ఆపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహిం చారు. జిల్లా కార్యదర్శి సురేష్ నివాసంలో సరస్వతి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. కార్యక్రమంలో హరిప్రసాద్, శ్రీనివాసులు, ఆంజినాయక్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

● కదిరిఅర్బన్: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యా సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం వసంత పంచమి వేడుకలు నిర్వహించారు. సరస్వతి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్, ఉపాధ్యాయులు శ్రీరామ్‌నాయక్, లక్ష్మీ, హరిప్రసాద్, శ్రీనివాసులు, ఆంజినాయక్, రాజేంద్ర, రాజేంద్రప్రసాద్, శ్రీకాంత్, కవిత పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

చౌడేశ్వరి దేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రామలింగ చౌడేశ్వరీదేవి

పరిగి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్ద రెడ్డిపల్లి గ్రామంలో శ్రీరామలింగ చౌడేశ్వరి దేవాలయం నిర్మించి సంవత్సరం పూర్తికావడంతో ఆదివారం అమ్మవారికి ఘనంగా పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో హోమాలు, నైవేద్యాలు, శాంతిపూజలు నిర్వహించారు. భక్తాదులు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆదినారాయణరెడ్డి, వెంకటరమణస్వామి, రుద్రప్ప, రమేష్, రామక్రిష్ణ, కిష్టప్ప, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలుకు లక్ష డప్పులు



ప్రదర్శన చేస్తున్న నాయకులు

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ అమలుకై 'లక్షడప్పులు వేల గొంతులు' కార్యక్రమాన్ని పెద్దఎత్తున చేపడుతున్నట్లు ఎంఈఎఫ్, ఎంఆర్‌పీఎస్ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక అంబేద్కర్ సర్కిల్‌వద్ద పెద్దఎత్తున డప్పులు కొట్టి పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 7న ఛలో హైదరాబాద్ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున మాదిగల ప్రదర్శన, ర్యాలీ ఉంటుందని, వాటిని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఎఫ్ నాయకులు నాగేంద్రనాథ్, శివకుమార్, ఎంఆర్‌పీఎస్ నాయకులు పెద్దన్న, సత్యనారాయణ పాల్గొన్నారు.

టీ20 వరల్డ్ కప్ సాధించడం హర్షణీయం

● ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిరటౌన్,ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి):అండర్-19 మహిళా టీ20 వరల్డ్ కప్ ఫైనల్‌లో సౌతాఫ్రికా జట్టుపై భారత్ మహిళాజట్టు ఘన విజయం సాధించి దేశానికి రెండోసారి టీ20 ప్రపంచకప్‌ను అందించడం హర్షణీయమని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి అన్నారు. వారు ఆదివారం ఈ మేరకు ఒక ప్రకటన చేస్తూ భారతదేశాన్ని విజయపథంలో నిలిపిన మహిళా క్రికెట్ జట్టుకు అభినందనలు తెలుపుతున్నామన్నారు. ఫైనల్ మ్యాచ్‌లో మహిళా జట్టు ఆటతీరును చూసి భారతావని గర్వించిందని, మరిన్ని విజయాలతో దేశ కీర్తి ప్రతిష్ట ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.

కొండాపురం డాక్టర్‌కు సన్మానం

గోరంట్ల, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి మాధవికి గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ అవార్డు రావడంతో ఆమెను ఆదివారం ఘనంగా సన్మానించారు. ఏపీఎన్జీవోల రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రాజేశ్వరీ ఆధ్వర్యంలో ఆసుపత్రిలో ఆమెను శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ వెంకటేశ్వరావు, ఏఎన్ఎంలు ప్రమీల, నూర్జహాన్, భ్రమరాంబ, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబాకు అర్చన



తండులార్చన చేస్తున్న పిల్లలు

పెనుకొండ, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి):విశ్వశాంతి కోరుతూ సత్యసాయిబాబా చిత్రపటానికి 108సార్లు బాలవికాస్ పిల్లలచేత తండులార్చన కార్యక్రమాన్నినిర్వహించారు. ఆదివారం సత్యసాయి మందిరంలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): నానెప్ప నగర్‌లో గాయత్రీమాత ఆలయ వార్షోకోత్సవాన్ని ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గణపతి హోమాలు, గాయత్రీహోమం, అమ్మవారికి కుంభాభిషేకం చేశారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నాగుల ప్రతిష్ఠకు ఏర్పాట్లు

సోమందేపల్లి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): నాగుల ప్రతిష్ట మహోత్సవం ఆదివారం సాయంత్రం ఘనంగా ప్రారంభమైంది. తొలిరోజు నాగుల విగ్రహాలను సాంప్రదాయ పద్దతిలో అక్కమ్మగార్ల కొండ నుంచి ఎడ్లబండిపై ఊరేగింపుగా తీసుకెళ్లారు. షిర్డీనగర్‌లో ప్రతిష్ఠించనున్న నాగులకు అడుగడుగునా శివనామస్మరణతో శివస్వాములు భజన చేస్తూ ముందుకు కదలగా మహిళలు ఎడ్లబండ్ల ముందు నీళ్ల పోస్తూ భక్తిశ్రద్దలతో కార్యక్రమంలో పాల్గొన్నారు. మంగళ వాయిద్యాలతో నాగులకట్టకు చేరుకుని ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. సోమవారం ఉదయం ప్రాణప్రతిష్ట నిర్వహిస్తారని పట్టణ ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు పేర్కొన్నారు.

నకిలీ కంపెనీ డీలర్లను నమ్మవద్దు

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): డ్రిప్ పరికరాలు పొందే రైతులు నకిలీ కంపెనీ డీలర్లను నమ్మవద్దని ఏపీ ఎంఐపీసీ ప్రాజెక్ట్ డైరెక్టర్ సుదర్శన్ ఆదివారం రైతులకు సూచించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందించే సబ్సిడీతో డ్రిప్ పరికరాలు, స్ప్రింక్లర్లు కావాల్సిన రైతులు ఆన్‌లైన్ పేమెంట్ ద్వారా డీడీలు చెల్లించాల్సి ఉందన్నారు. రైతులు ఆర్బీకేలో రిజిస్టర్ చేసుకున్న తరువాత ఎంఐఏఓల ఆధ్వర్యంలో బీటక్యూ అయిన వెంటనే రైతులకు ఎంత మొత్తం డీడీ ద్వారా చెల్లించారో మెసేజ్ ద్వారా తెలుస్తుందన్నారు. కొన్ని మండలాల్లో కొంతమంది కేటుగాళ్లు నకిలీ కంపెనీ పేర్లు చెప్పి రైతులతో డబ్బు వసూలు చేస్తున్నారని తెలిసిందన్నారు.

భయపెడుతున్న ప్లాస్టిక్

● విచ్చలవిడిగా కవర్ల వాడకం
● చెత్తకుప్పల్లో పడేసి.. నిప్పుపెడుతున్న వైనం
● నియంత్రించని మునిసిపల్ యంత్రాంగం



నిప్పు పెట్టడంతో సగం కాలిన కవర్లు

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఇటీవల కాలంలో కేన్సర్‌కేసులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇందుకు కారణం ఏమిటా అని విచారిస్తే విచ్చలవిడిగా వాడుతున్న ప్లాస్టిక్ కవర్లు ఇందుకు కారణమని తెలుస్తోంది. సాధారణంగా 50 మైక్రాన్లకన్నా ఎక్కువ మందమున్న ప్లాస్టిక్ కవర్లను మనం వాడాల్సి ఉండగా, మార్కెట్‌లో ఆ ప్రమాణాలు ఎక్కడా పాటించడంలేదు. ఇక్కడ అక్కడ అని కాదు ఏ ప్రాంతంలో చూసినా కుప్పలు కుప్పలుగా ఉల్లిపొరలాంటి ప్లాస్టిక్ కవర్లు, సంచులు దర్శనమిస్తున్నాయి. ఏ దుకాణంలో చూసినా కవర్లను కొల్లలుగా విక్రయిస్తున్నారు. తోపుడు బండ్లలో వ్యాపారం చేసే వారి వద్ద నుంచి టోకు వ్యాపారం చేసే వారి వరకు ప్లాస్టిక్ కవర్లు కనిపిస్తాయి. ఉదయం నుంచి రాత్రి పడుకునే వరకు వాటి వినియోగం తప్పనిసరైంది. వినియోగించిన అనంతరం వాటిని చెత్త కుప్పల్లో పారవేస్తున్నారు. చెత్త పేరుకుపోవడంతో వాటిని తొలగించకపోగా కొందరు వాటికి నిప్పుపెడుతున్నారు. దీంతో దట్టంగా పొగ ఏర్పడటమే కాకుండా దుర్వాసన వెదజల్లుతోంది. ఆ వాసనకు ఊపిరాడనంతపని అవుతోందని ప్రజలు వాపోతున్నారు. ప్లాస్టిక్ కవర్ల వాడకంతో కేన్సర్ ముప్పు ఎక్కువవుతోందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఆహార వ్యర్థపదార్థాలతో కూడిన ప్లాస్టిక్ కవర్లను డస్ట్‌బిన్‌ల వద్ద పడవేయడంతో వాటిని ఆవులు తిని అరిగించుకోలేక కడుపునొప్పితో విలవిలలాడిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇంత జరుగుతున్నా మునిసిపల్ శానిటేషన్ అధికారులు, కమిషనర్ ఏ మాత్రం పట్టించుకోవడంలేదు. వారికి ప్రజా సమస్యలపై శ్రద్ధ లోపించింది. వారు ప్లాస్టిక్ కవర్ల విక్రయదారులతో లోపాయికారి ఒప్పందం ఏమైనా చేసుకున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఇంతకు ముందు మునిసిపల్ కమిషనర్, మునిసిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, సిబ్బందితో కలిసి తరచు ప్లాస్టిక్ కవర్ల హోల్‌సేల్, రిటైల్ విక్రయదారుల దుకాణాలపై దాడులు చేసి కవర్లను సీజ్ చేసి జరిమానా విధించేవారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న మునిసిపల్ కమిషనర్ మాత్రం వీటి గురించి ఏ మాత్రం పట్టించుకోవడంలేదు. ప్రజా సమస్య లను గాలికొదిలేశారు. జరగాల్సిన నష్టం జరుగకముందే సంబంధిత అధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. హిందూపురంలో ప్రతి రోజు టన్నుల కొద్ది ప్లాస్టిక్ కవర్ల విక్రయం జరుగుతోంది. చిన్న దుకాణాలు, తోపుడు బండ్ల వద్ద కాకుండా వాటిని తయారుచేసే పరిశ్రమలను సీజ్‌చేయడానికి గట్టిగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్లాస్టిక్ కవర్ల వాడకంతో కేన్సర్ ముప్పు



ప్లాస్టిక్ వాడకం ప్రభావం ప్రజలపై పడుతుంది. తరచు ప్లాస్టిక్ వాడకంతో క్యాన్సర్, ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్, చర్మవ్యాధులు సంక్రమిస్తాయి. వ్యాధులు వచ్చిన తరువాత జాగ్రత్త పడేకంటే వ్యాధులు రాకుండా జాగ్రత్త తీసుకుంటే బాగుంటుంది. లేకుంటే అందరం కేన్సర్ బారిన పడాల్సి ఉంటుంది.

డా.నరేంద్ర జక్కా

దాడులు చేసి.. చర్యలు చేపడతాం



ప్లాస్టిక్ కవర్ల విక్రయాలు తీవ్రమైనాయని మాకు ఫిర్యాదులు అందుతున్నాయి. వీటిపై దాడులు చేయడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. దాడులు చేసి కఠిన చర్యలతో పాటు జరిమానాలు కూడా విధిస్తాం. ప్లాస్టిక్ కవర్లు పట్టుపడితే సీజ్ చేస్తాం.

-శంకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

చదువుల తల్లిని ప్రార్థిస్తే అనంత ఐశ్వర్యం

● ఘనంగా వసంత పంచమి

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): చదువుల తల్లి సరస్వతీదేవిని ప్రార్థిస్తే అష్ట ఐశ్వరాలు సిద్దిస్తాయని నానుడి. వసంత పంచమిని పురస్కరించుకొని ఆదివారం పట్టణంలోని ఎంఎఫ్‌రోడ్డులో నెలకొన్న శ్రీ లక్ష్మీహయగ్రీవ స్వామి ఆలయంలో వాసవీక్లబ్ ఆధ్వర్యంలో అక్షరభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవీక్లబ్ సభ్యులు మాట్లాడుతూ లోకంలో ఏ వస్తువునైనా దొంగలించవచ్చునని, కాని జ్ఞానాన్ని దొంగలించడం సాధ్యపడదన్నారు. వసంత పంచమి అంటే సరస్వతీదేవి పుట్టిన రోజు కాబట్టి చిన్నారులకు ఆ రోజు అక్షరభ్యాసం చేయిండం ఆనవాయితీ అని పేర్కొన్నారు. జ్ఞానానికి అధిపతి లక్ష్మీ హయగ్రీవ స్వామి అని, అందుకే గత 10 సంవత్సరాలుగా ఈ ఆలయంలో వసంతపంచమి వేడు కలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా మూల విరాట్‌ను సర్వాంగ సుందరంగా అలంకరించారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ అధ్యక్షుడు రామవేంద్రగుప్తా, కార్యదర్శి దాస విష్ణు, కోశాధికారి కిరణ్, ఇంటర్‌నేషనల్ సభ్యులు దాసా సందేష్, తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులను ఆశీర్వదిస్తున్న వేద పండితుడు



పూజల్లో పాల్గొన్న చిన్నారులు, వారి తల్లిదండ్రులు

మడకశిరలో...

మడకశిరటౌన్: వసంత పంచమిని పురస్కరించుకొని పట్టణంలోని షిరిడీ సాయినాథుడి ఆలయంలో చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం వసంత పంచమి సందర్భంగా షిరిడీ సాయినాథుడి ఆలయంలో ప్రత్యేకంగా సరస్వతీ దేవి చిత్రపటాన్ని ఉంచి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. సరస్వతీ దేవి పుట్టిన రోజున విద్యాభ్యాసం చేయిస్తే, చదువు సవ్యంగా సాగుతుందనే నమ్మకంతో ఆదివారం సరస్వతీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు.

ఘంటసాల గానం.. అజరామరం..

పెనుకొండ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): అమరగాయకుడు పద్మశ్రీ ఘంటసాల గానం అజరామరమని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం స్థానిక అఫిషియల్‌క్లబ్ ప్రాంగణంలో సాంస్కృతిక కళాపరిరక్షణ సమితి అధ్యక్షుడు కోనాపురం ఈశ్వరయ్య ఆధ్వర్యంలో ఘంటసాల వీరాభిమాని నాగేంద్ర జ్ఞాపకార్థం ఘంటసాల సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన టీడీపీ నాయకులు వెంకటేశ్వర్లు, మాధవనాయుడు, కన్వీనర్ శ్రీరాములు, సమత అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ అమరగాయకుడు ఘంటసాల భౌతికంగా మన మధ్య లేనప్పటికీ ఆయన ఆలపించిన పాటలు నేటికీ మనమదిలో మెలుగుతున్నాయన్నారు. ఘంటసాల జయంతి, వర్ధంతులను ఆయన అభిమాని షోడాల నాగేంద్ర నిర్వహిస్తుండేవారని ఆయన ఇటీవల మృతి చెందడంతో ఆ బాధ్యతను కోనాపురం ఈశ్వరయ్య తీసుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమానికి ప్రగతి గ్రామీణ బ్యాంక్‌సమత స్వచ్ఛంద సంస్థ సహకారం అందించడం అభినందనీయమన్నారు. కళాకారులు చంద్రతేజ, మహాలక్ష్మీ, శ్రీనివాస్ ఆరుద్ర, హరిబాబు, జ్యోతి, శోభ తదితరులు ఆలపించిన ఘంటసాల మధురగీతాలు సంగీత ప్రియులను ఆకట్టుకున్నాయి.



ఘంటసాల గీతాలను ఆలపిస్తున్న గాయకులు

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక

అమరాపురం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మడకశిర మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో ఆదివారం పలువురు నాయకులు వైసీపీని వదిలి తెలుగుదేశం పార్టీలో చేరారు. హేమావతి పంచాయతీ గుణేహళ్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ సర్పంచి హనుమంతరాయప్ప, ఎం.ఆర్.తిప్పేస్వామి, వి.హనుమంతరాయ, పి.హనుమంతరాయ, వైసీపీ నుండి కృష్ణప్ప, వీరప్ప, మారేగౌడ, కృష్ణమూర్తి, వీరాపురం గ్రామం నుండి వైసీపీ నాయకులు ఎం.చెన్నప్ప, హరీష్ వీరితోపాటు 50 కుటుంబాలు వైసీపీ, కాంగ్రెస్ పార్టీలకు రాజీనామా చేసి మాజీ ఎమ్మెల్సీ ఆధ్వర్యంలో పసుపు కండువా కప్పుకొని తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ గణేష్, ఎస్సీ సెల్ నియోజకవర్గం అధ్యక్షులు జయకుమార్, మాజీ జడ్పీటీసీ నరసింహమూర్తి, శివరుద్రప్ప, మాజీ నవీన్, రఘు, తదితర నాయకులు పాల్గొన్నారు.



గుండుమల ఆధ్వర్యంలో టీడీపీలోకి చేరుతున్న వైసీపీ నాయకులు

ఉద్యోగ సంఘం అధ్యక్షుడి ఎన్నిక

మడకశిరటౌన్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆదివారం పంచాయతీరాజ్ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఎన్నికలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు తిప్పేస్వామి, సిక్బద్‌తుల్లా ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. మడకశిర మండల అధ్యక్షులుగా హనుమంతరాయప్ప, కార్యదర్శిగా దేవానంద్‌కుమార్, గుడిబండ అధ్యక్షులుగా దాక్షాయిణి, అదేవిధంగా సభ్యులుగా సింగరాజు, తిమ్మక్క, తిప్పేస్వామి, తదితరులతోపాటు సభ్యులను ఎన్నుకోవడం జరిగింది. కొత్తగా ఎన్నికైన అధ్యక్షులు, సభ్యులకు తోటి ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

నేటి నుంచి కొల్లాపురమ్మ జాతర

అగళి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): అగళి మండలం హనుమనపల్లి గ్రామంలో నేటి నుంచి రత్నగిరి కొల్లాపురి అమ్మవారి జాతర మహోత్సవాలు నిర్వహించనున్నట్లు టీడీపీ ఎంపీటీసీ చంద్రప్ప తెలిపారు. రెండు రోజులలపాటు ఈ ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నామన్నారు. సోమవారం రత్నగిరి కొల్లాపురం హనుమనపల్లి గ్రామానికి తీసుకువచ్చి మంగళవారం నాడు మహిళలు భక్తిశ్రద్దలతో హారతులు మోస్తూ మొక్కుబడులు తీర్చుకుంటారు. 8నుంచి కంబద రంగనాథస్వామి మహోత్సవాలు

అలాగే ఈనెల 8నుండి 15వరకు కంబద రంగనాథ స్వామి మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు పుష్పలత, భరత్‌కుమార్‌లు తెలిపారు. మాఘమాసంలో ఈ జాతర వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

35 ఏళ్ల తర్వాత పలకరింత..



ముద్దిరెడ్డిపల్లి పాఠశాల పూర్వ విద్యార్థులు

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పాఠశాల చదువులు తీపి గుర్తులని ముద్దిరెడ్డిపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. 1990లో పదో తరగతి చదివని విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. చిన్ననాటి స్నేహితులు, ఆనాటి అల్లర్లు గుర్తుచేసుకున్నారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకొని ఆనందం వ్యక్తం చేశారు. గురువులు కోదండరాం, ప్రభాకర్, ఆంజనేయులు, నాగరాజ్, జయరాం, పీఈటీ నాగరాజును సన్మానించారు. కార్యక్రమంలో శ్రీకాంత్, చంద్రశేఖర్, బాలాజీ, పెద్ద సంఖ్యలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

గుట్టూరులో..



తమ గురువులతో పూర్వ విద్యార్థులు

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి) : పూర్వ విద్యార్థులు ఆదివారం మండలంలోని గుట్టూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో కలిశారు. 2000-2001 సంవత్సరం చదివిన పూర్వ విద్యార్థులు 24ఏళ్ల తరువాత పాఠశాలలో తమ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను ఆహ్వానించి వారిని ఘనంగా సన్మానించారు. ఒకరినొకరు కలిసి యోగ క్షేమాలు తెలుసుకున్నారు. పూర్వవిద్యార్థులందరూ గురువులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం గురువులు రామచంద్ర, మాధవిలత, హనుమంతు, జానకి, వనజ, రామక్రిష్ణ, వెంకటరామిరెడ్డిని సన్మానించారు.